01ATP17F_01ATP17F.qxd 17-12-2024 PM 11:41 Page 1



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 18 డిసెంబర్ 2024 | పేజీలు : 04

# బాలయ్యకు, పార్టీకి సేవకుడిని

## - వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆనంద్



బేవినహళ్లి ఆనంద్

**హిందూపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త**

విధేయత.. విశ్వసనీయత.. అంకితభావానికి మారుపేరుగా నిలిచారు తెలుగుదేశం పార్టీకి చెందిన వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవినహళ్లి మెల్లయ్య గారి ఆనంద్ కుమార్. 1977 మార్చి 4 తేదీన అశ్వతమ్మ, అంజనప్ప దంపతులకు జన్మించిన ఆనంద్ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి పట్టుదలతో విద్యాభ్యాసం చేసి ఉన్నత చదువులు అభ్యసించారు. బేవినహళ్లిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, కిరికెర బసవనపల్లి హైస్కూల్లో టెన్త్ క్లాస్ చేశారు. సేవా మందిరంలో ఇంటర్మీడియట్, హిందూపురం ఎస్.డి.జి.ఎస్. కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతపురం విజయనగర లా కళాశాలలో ఎల్.ఎల్.బి. అభ్యసించారు. విద్యార్థి దశలోనే చదువుతోపాటు సమకాలిన రాజకీయాలు, విద్యార్థి నాయకుడిగా సామాజిక చైతన్యం కలిగి ఉండడంతో 1996 సంవత్సరం నుంచే కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేయడం ప్రారంభించారు. 2001లో బేవనహళ్లి పంచాయతీ సర్పంచ్ గా బరిలోకి దిగి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చినారు. 2005 లో ఉప సర్పంచ్ గా పనిచేశారు. 2007 నుంచి హిందూపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. 2013 లో హిందూపురం సింగిల్ విండో సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అదే సమయంలో బేవనహళ్లి పంచాయతీ సర్పంచ్ గా తన సతీమణి మాలతిని పోటీ చేయించి ఘన విజయం సాధించారు. దంపతులిద్దరూ 2013 నుంచి 2018 వరకు ఆయా పదవుల్లో ఉండి సేవలు అందించారు. రాష్ట్రం విడిపోయి సమైక్యాంధ్ర ఉద్యమం తో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోగా తదుపరి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రోత్సాహంతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ తర్వాత రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల క్రమంలో జడ్పిటిసిలు, ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ పోటీ చేయదని టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించినప్పటికీ హిందూపురం టిడిపి జెడ్పిటిసి అభ్యర్థిగా ఆనంద్ బరిలోకి దిగి స్వల్ప మెజారిటీతో ఓటమి చెందారు. అధికార వైసీపీ పై పోటీ చేసేందుకు ఆ సమయంలో ఎవరు ముందుకు రాకపోవడంతో సాహసోపేతంగా బరిలోకి దిగి సత్తా చాటారు. అదే సమయంలో హిందూపురం నియోజకవర్గం లో ఎక్కడ లేని విధంగా హిందూపురం మండలంలో బేవినహళ్లి సహా నాలుగు ఎంపీటీసీ స్థానాలను టిడిపి కైవసం చేసుకుని అధికార వైసిపికి చెక్ పెట్టడం సంచలనంగా మారింది. అదే సమయంలో తన తమ్ముడిని సర్పంచ్ గా బరిలోకి దించి గట్టి పోటీ ఇచ్చారు. పార్టీ కోసం గట్టిగా నిలబడి ప్రత్యర్థి వైసీపీని ఢీ కొట్టడం, పార్టీ పటిష్టతకు పనిచేయడం గుర్తించిన తెలుగుదేశం హై కమాండ్ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ ను నియమించింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేపట్టిన ఉద్యమాల్లో కీలకంగా అందరితో కలిసి పని చేశారు. ఇటీవల ఏపీలో మరల తెలుగుదేశం పార్టీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి రోడ్డు రోలర్ మెజారిటీతో అధికారం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కోసం కష్టపడిన నాయకులకు హై కమాండ్ నామినేటెడ్ పదవులకు ఎంపిక చేసిన క్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆశీస్సులతో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవి ఆనంద్ ను వరించింది. రెండున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందిన ఆనంద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలయ్య బాబు గుర్తించి తనకు ఈ పదవిని ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాసరావు, బాలాజీ సహకారం మరచిపోలేనిదని అన్నారు. ఆదర్శ నియోజకవర్గంగా హిందూపురాన్ని అభివృద్ధి చేసేందుకు బాలయ్య ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇటీవల తమ పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరయ్యాయని 50 లక్షల రూపాయల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. పదవులు ఎన్ని వచ్చినా తాను బాలయ్యకు, పార్టీకి సేవకుడినే నని అభివర్ణించారు.

# వ్యక్తిగత దూషణలతో దద్దరిల్లిన అనంత నగరపాలక సంస్థ సమావేశం

- సమస్యలు పరిష్కారం చేయలేని సమావేశాలెందుకు
- వాకౌట్ చేసిన కో ఆప్షన్ మెంబర్
- కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో రూ.60 లక్షల దోపిడీకి బిల్లులు
- ఆలమూరు జనగన్న కాలనీని పరిటాల సునీత కాలనీగా మార్పు
- 500 మంది టిడిపి బినామీలకు కట్టబెట్టారు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ మహమ్మద్‌వసీం, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం కలెక్టరేట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలో నగరపాలక సంస్థ సమావేశం భవనంలో మంగళవారం కార్పోరేటర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మేయర్ మహమ్మద్‌వసీం అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కమీషనర్, డిప్యూటి మేయర్లు దాసరి వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పోరేటర్లు హాజరయ్యారు. ప్రారంభంలోనే అజెండాను సమస్యలను పక్కన పెట్టి కార్పోరేటర్ల మధ్య వ్యక్తిగత దూషణలతో సమావేశం కాస్త రసాబాసాగా మారింది. మేయర్, ఎమ్మెల్యే, డిప్యూటి మేయర్లు, కమీషనర్లు జోక్యం చేసుకుని సర్ది చెప్పడానికి ప్రయత్నించినప్పటికి సభ కాస్త రణరంగాన్ని తలపించింది. మున్సిపల్ అధికారులు పాలకవర్గానికి కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిన చేసిన పనులకు చేయని పనులకు దొంగ బిల్లులు పెట్టి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే 130 మంది మున్సిపల్ కార్మికులను పక్కన పెట్టడం సమంజసంకాదని వారిని వెంటనే విధుల్లోకి తీసుకుని వారికి పెండింగ్‌లో వున్న వేతనాలు వెంటనే చెల్లించాలని కార్పోరేటర్లు డిమాండ్ చేశారు. నగరంలో 50 డివిజన్లలో 3052 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు అధికారులు తప్పుడు బిల్లులు పెట్టి 60 లక్షల ప్రజాధనాన్ని దోపిడీ చేయడానికి ప్రయత్నిస్తున్న మున్సిపల్ అధికారుల తీరుపై కార్పోరేటర్లు మండిపడ్డారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేసి వుంటే ఎందుకు నగరంలో కుక్కల సంఖ్య నానాటికి పెరిగిపోతోందని డిప్యూటి మేయర్ ఘాటుగా విమర్శించారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగా నగరంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. స్వయానా ముగ్గురు కార్పోరేటర్లు వీధి కుక్కలకాటుకు గురయ్యారన్నారు. అలాగే పాఠశాలలకు వెళ్లే చిన్నారులు భయం భయంగా వెళుతున్నారన వెంటనే నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు, ఆవులు, పందులను వెంటనే ఊరి బయటకు తరలించాలని, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తిపై సభ్యులు ధ్వజమెత్తారు. అలాగే పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వీధిలైట్లు, రోడ్డు, మురుగుకాలువల శుభ్రత, మంచినీటి కొళాయిల ఏర్పాటులో లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడి ప్రజా ధనాన్ని స్వాహా చేస్తున్నారని ఆయనపై మండిపడ్డారు. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో కూడా తీవ్రస్థాయిలో అవినీతి జరుగుతోందని ఆరోపణలు చేశారు. నగర సుందరీకరణలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. అలాగే నగరంలో అనుమతులు లేకుండా విచ్చలవిడిగా



వాగ్వాదం చేసుకుంటున్న దృశ్యం

ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు అధికారులకు తెలియకుండా ఎలా ఏర్పాటు చేస్తున్నారని నిలదీశారు. వీటిపై ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడానికి ఎన్ని రోజులకు అనుమతి తీసుకుంటున్నారు వాటి అనుమతి సమయం పూర్తవగానే వాటిని తొలగించడం తెలియదా అని ఇన్‌చార్జ్ కమీషనర్‌కు చురకలు వేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ఆలమూరు జగనన్న లేఅవుట్‌లో 5 వేల మంది పేదలకు పట్టాలు ఇచ్చారు. అందులో దాదాపు 80 శాతం వరకు గృహప్రవేశాలు కూడా చేశారు. ప్రభుత్వం దిగిపోవడంతో మిగిలిన 20 శాతం మంది ఇళ్లు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ కాలనీ కాస్తా ఇప్పుడు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ కాలనీగా మార్చివేశారని అదేవిధంగా దాదాపు 200 మంది వరకు టిడిపి కార్యకర్తలకు బినామీ పట్టాలిచ్చారని సభ్యులు మండిపడ్డారు. ఈ సమస్య కాస్త పరిశీలించి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సభ్యులకు తెలియచేశారు. నగరంలో చెత్త తరలించేందుకు డివిజన్‌కు ఎన్ని వాహనాలు కేటాయించారు. వీటిలో ఎన్ని సక్రమంగా పనిచేస్తున్నాయని మున్సిపల్ అధికారులను కార్పోరేటర్లు ప్రశ్నించారు. ఇందులో సగం వాహనాలు పనిచేయలేదని అధికారులు చెబుతూ వాటిని పనిచేస్తున్న డ్రైవర్లకు మాత్రం వేతనాలు పెంచడం విషయం అజెండాలో ఎలా పెడతారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అర్హులైన పేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# గోరంట్లలో మంచు తెరల మధ్య..

# మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ గుడ్‌మార్నింగ్ కార్యక్రమం

- బట్టీకొట్టులో టీ తాగుతూ..ప్రయాణీకులతో ముచ్చటిస్తూ జనానికి చేరువవుతున్న ఉషశ్రీచరణ్
- వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం నింపుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ జనంలోకి
- పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా మండల కేంద్రాల్లో గుడ్‌మార్నింగ్ పేరుతో కార్యక్రమాలు



టీ దుకాణంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

**గోరంట్ల, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

ప్రజా సమస్యలపై పోరాటం సాగించేందుకు స్థానిక సమస్యలను తెలుసుకోవాలన్న లక్ష్యంగా గుడ్‌మార్నింగ్ గోరంట్ల పేరుతో మాజీమంత్రి, శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ వినూత్న తరహాలో ప్రజలతో మమేకమవుతూ వేకువజామునే మంచు తెరల మధ్య గోరంట్ల పట్టణంలో మంగళవారం ఉదయం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఒక పక్క రోడ్డు కనిపించనంత మంచు తెరలు కప్పుకున్న లెక్క చేయక దట్టంగా కురుస్తున్న మంచులోనే ఒక పక్క చలి మంటల్లో చలి కాపుకుంటూ టీ కొట్టులో సాధారణ వ్యక్తిలా టీ తాగుతూ అక్కడున్న ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుంటూ జనంతో మమేకమయ్యారు ఉషశ్రీచరణ్. గోరంట్ల మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ తమ పార్టీ నాయకులతో కలిసి గుడ్‌మార్నింగ్ గోరంట్ల పేరులో ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పాత స్టేట్‌బ్యాంకు వద్ద గల టీ దుకాణంలో ఆమె సాధారణ వ్యక్తిలా టీ తాగుతూ ప్రజలతో ముచ్చటించారు. అలాగే పూజలు, వ్యాపారులతో పాటు బస్టాండ్‌లో ప్రయాణీకులతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బోయ సాధికార సమితి కార్పోరేషన్ మాజీ స్టేట్ చైర్మన్ పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి,



పూల వ్యాపారులతో మాట్లాడుతున్న దృశ్యం

పట్టణ కన్వీనర్ మేదర శంకర, జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, మాజీ సర్పంచు పెయ్యాల శివారెడ్డి, పోతుల రామకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, గంపల రమణారెడ్డి, ఫక్రుద్దీన్, పట్టణ ఉపసర్పంచు రాజారెడ్డి, మాజీ ఎంపిటిసి గంగిరెడ్డి, ఎంపిటిసి ఓబుల్‌రెడ్డి, హేమసుందర్‌రెడ్డి, గుడిసె నాగరాజు, జొన్న ఆంజనేయులు, ఎంపిటిసి సోమశేఖర్, బూదిలి సర్పంచు ఆంజి, కురుబ సత్యనారాయణ, హరినాథ్‌రెడ్డి, సర్పంచు వాసునాయక్, ఖాన్ బ్రదర్స్ సుభాన్, నబిరసూల్, ఓబుల్‌కుమార్, జబ్బార్, సిరగంవాండ్లపల్లి శివ, మల్లాపల్లి బాబావలి, తదితరులు పాల్గొన్నారు.

# పడకేసిన పాలన..గురకేస్తున్న పర్యవేక్షణ..!

## - సిబ్బందిపై పట్టుకోల్పోతున్న అధికారులు - రూ.లక్షలు వెచ్చిస్తున్నా నెరవేరని లక్ష్యం



సి.లక్షుంపల్లి సచివాలయం



పత్తాలేని సచివాలయ సిబ్బంది, ఖాళీగా దర్శనమిస్తున్న కార్యదర్శి కుర్చీ

**యాడికి(తాడిపత్రి), డిసెంబరు17, ప్రభాతవార్త**

ప్రభుత్వ సేవలను గ్రామీణుల చెంతకు చేర్చాలనే లక్ష్యంతో రూ. కోట్లు వెచ్చించి భవనాలకు, రూ. లక్షలు వెచ్చించి వేతనాలకు ఖర్చు చేస్తున్నా ప్రజాసేవలో నిర్లక్ష్యం వీడటం లేదని సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయానికి 11 మంది సిబ్బందిని కేటాయించి పాలన వేగవంతం చేయాలనే ప్రభుత్వ సంకల్పం నీరుగారుతోంది. నియోజకవర్గంలోని ఆయా సచివాలయాల పరిధిలో పడకేసిన పాలనతో ఆయా గ్రామాల ప్రజలు ఎప్పటిలాగే మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సివస్తోంది. సచివాలయాల పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంతో కొందరు సచివాలయ సిబ్బంది పాడింది పాటగా..ఆడింది ఆటగా పాలన సాగుతోంది. పింఛన్ల పంపిణీ సమయంలో మినహా సచివాలయ సిబ్బంది పూర్తి స్థాయిలో సేవలు అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి సచివాలయ సిబ్బందికి వేతనాల రూపంలో ప్రతి నెలా దాదాపు రూ. 4 లక్షలు వంతున ప్రభుత్వం వెచ్చిస్తోంది. వీరికి అవసరమైన భవనాలు, వసతుల కల్పనకు రూ. కోట్లలో వెచ్చింది. ఇంత చేస్తున్నా ప్రజా సమస్యల పరిష్కారం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైందనే వాదనలు వినిపిస్తున్నాయి. తమ సమస్యల పరిష్కారానికి సచివాల యాల స్థాయిలో మార్గం లభించడం లేదని గ్రామీణులు మండల కేంద్రానికి దారి పడుతున్నారు. మండల కేంద్రం మినహా గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళుతున్నారో.. ఎలాంటి విధులు నిర్వహిస్తున్నారోనని పర్యవేక్షించాల్సిన అధికారులు మండల కేంద్రానికి రావడమే గగనంగా మారుతున్నవేళ ఇక సచివాలయాల పరిస్థితి వేరే చెప్పక్కరలేదని ప్రజలు పెదవి విడుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సచివాలయాలు ఉన్నా ఒకటే..లేకున్నా ఒకటే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయాల దుస్థితికి మంగళవారం సి.లక్షుంపల్లి సచివాలయం అద్దం పట్టేలా కనిపించడం విశేషం. మధ్యాహ్నం 12.30 గంటలకే సిబ్బంది పత్తాలేకుండా పోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పవచ్చు. మండల స్థాయి అధికారులు కనీసం చుట్టపు చూపుగానైనా సచివాలయాలను సందర్శించి మెరుగైన పాలన అందించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

# కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తో మాట్లాడుతున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలిసారు. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం ఆయన టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు కృష్ణదేవరాయలతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. రాష్ట్ర బడ్జెట్ ను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే ప్రవేశ పెట్టింది. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పయ్యావుల కేశవ్ తొలిసారి రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రిని కలిసి సమావేశమైన మంత్రి పయ్యావుల కేశవ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చర్చించారు.

# సమస్యలు లేని అభివృద్ధి నగరంగా అనంతపురాన్ని మారుస్తాం

- నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- రసాబసగా మారుతున్న కౌన్సిల్ సమావేశాన్ని గాడిలో పెట్టిన ఎమ్మెల్యే
- కీలక సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ తీర్మాణం
- డంపింగ్ యార్డు, ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణంపై క్లారిటీ ఇచ్చిన ఎమ్మెల్యే



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

సమస్యలు లేని, అభివృద్ధి చెందిన నగరంగా అనంతపురంని మారుస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాల యంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మేయర్ వసీం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు కార్పోరేటర్లు వారివారి డివిజన్‌లోని సమస్యలను ప్రస్తావించారు. కొందరు వైసీపీ కార్పోరేటర్లు పదేపదే సభకు అంతరాయం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కల్పించుకొని సమావేశాన్ని గాడిలో పెట్టి ప్రయత్నం చేశారు. ముఖ్యంగా కార్పోరేటర్లు ప్రస్తావించిన ప్రతి సమస్యకు తగిన పరిష్కారంచూపించే విధంగా ఎమ్మెల్యే హామీ ఇస్తూ వచ్చారు. పండమేరు ప్రాంతంలో అర్బన్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రజలకు ఇళ్లు నిర్మించేందుకు సేకరించిన 170 ఎకరాల స్థలం ఆక్రమణకు గురవుతోందని ప్రస్తావించగా, ఇది గతంలోనే జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి డివిజన్‌లో పారిశుద్ధ సమస్య ఉందని, సిబ్బంది కొరత ఉందన్న అంశాల గురించి ప్రస్తావించారు. నడిమి వంక, మరువవంక ప్రొటెక్షన్ వాళ్లకు సంబంధించిన అంశం కూడా చర్చకు వచ్చింది. అలాగే బస్టాండ్ వద్ద ఉన్న సెంట్రల్ పార్కు స్థలం కూడా కబ్జాకు గురవుతోందని పలువురు ప్రస్తావించారు. డంపింగ్ యార్డు సమస్య కూడా తీవ్రంగా ఉందని చెప్పారు. వీటన్నింటికీ ఎమ్మెల్యే ఒక స్పష్టమైన పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పోరేటర్లు లేవనెత్తిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని అన్నారు. డంపింగ్ యార్డులో చెత్త పేరుకుపోయిందని గతంలో 3.5 లక్షల టన్నుల చెత్తను తరలించేందుకు 22 కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. అయితే ఇంకా చెత్త అలాగే ఉందని అన్నారు. దీనిని పూర్తి క్లియర్ చేసేలా తీర్మానం చేసినట్లు చెప్పారు. నగరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై కూడా తీర్మానం చేశామని వివరించారు. సెంట్రల్ పార్కు స్థలం గతంలో ఏడున్నర ఎకరాలు ఉండగా, ఇప్పుడు కేవలం నాలుగున్నర ఎకరాలు మాత్రమే మిగిలిందని, మూడు ఎకరాలకు కబ్జాలకు గురైందన్నారు. ఈ పార్కు కాంపౌండ్ వాల్ నిర్మాణం కూడా చేపట్టాలని తీర్మాణం చేసినట్లు వివరించారు. డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం 28 కోట్ల రూపాయల పనులకు తీర్మానం చేశామన్నారు. నడిమి వంక, ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం కోసం 125 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. ఇప్పటికే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి కూడా స్పష్టమైన హామీ ఇచ్చారని, మూడు విడుదలగా నిధులు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అలాగే మల్టీ లెవెల్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం నగరపాలక సంస్థలో ఉన్న కార్మికుల సంఖ్య నగర జనాభాకు ఏ మాత్రం సరిపోవటం లేదని మొత్తం 650 మంది కార్మికులు ఉన్నారన్నారు. వీరికి అదనంగా మరో 132 మంది కార్మికులను తీసుకుంటున్నట్లు వివరించారు. బదిలీ కార్మికులను తక్షణం ఆపేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశించారు. నగరంలో హిజ్రాల సమస్య ఎక్కువగా ఉందన్న ప్రస్తావనకు స్పందించారు. వెంటనే పోలీసులకు తగిన సూచనలు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి హామీ ఇచ్చారు.

# టీచర్ శైలజకు మరొక షోకాజ్ నోటీసు జారీ

- హెచ్‌ఎం, ఫిజికల్ సైన్స్ టీచర్‌కు కూడా
- కెఎస్‌ఆర్ హైస్కూల్లో సోమవారం విద్యార్థినులను విచారించిన జడ్జి
- ఆ టీచర్‌పై కావాలనే అసత్య ఆరోపణలు చేశామని డీఈవోకు లెటర్ రాసిన విద్యార్థినులు
- వాచ్‌మెన్,ఆయాలతో కూడా రాజీ అయినట్లు లెటర్ రాయించుకున్న వైనం
- అదంతా చర్యలు నుంచి తప్పించుకోవడానికే అంటున్న పలువురు టీచర్లు, సిబ్బంది

**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

జిల్లా కేంద్రంలోని కెఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మదమంచి శైలజకు మంగళవారం మరొక షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈవో ఎం.ప్రసాద్ బాబు తెలిపారు. ఆ స్కూల్లోని ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థినులను ఓ సోషియల్ స్కూల్ అసిస్టెంట్ ఎక్కడపడితే అక్కడ తాకుతున్నారనే వాయిస్ రికార్డింగ్‌లు సోషల్ మీడియాలోకి రావడంతో ఈనెల 4న పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి అదే రోజు ఐసీడీఎస్ పీడీ, విద్యాశాఖతో సంయుక్తంగా విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులు వాయిస్ రికార్డింగ్ ఉన్న విద్యార్థినులతో పాటు ఇతర విద్యార్థినులు, టీచర్లను, సిబ్బందిని విచారించారు. ఆ విచారణ నివేదికను డీఈవోకు అందజేశారు. డీఈవో ఆ విచారణ నివేదికను క్షుణంగా పరిశీలించి టీచర్ శైజల, హెచ్‌ఎం నారాయణ, ఓ ఫిజికల్ సైన్స్ టీచర్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అందుకు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

**విద్యార్థినులను స్వయంగా విచారించిన జడ్జి :**

విద్యార్థినుల పట్ల ఓ ఫిజికల్ సైన్స్ టీచర్ అసభ్యంగా ప్రవర్తిస్తూ...ఎక్కడ పడితే అక్కడ తాకుతున్నారనే విషయాన్ని ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థినులు వాయిస్ రికార్డింగ్ ద్వారా భయటకు తీసుకురావడం, పత్రికల్లో రావడంతో ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు విచారణ చేసి మిగతా 4లో...

02ATP17_02ATP17.qxd 17-12-2024 PM 11:47 Page 1



# నిరుపేద సాగుదారులకు భూములు కేటాయించండి

**సోమందేపల్లి డిసెంబర్ 17 ప్రభాతవార్త**

సోమందేపల్లి గ్రామంలోని భూమి లేని నిరుపేదలు, ప్రభుత్వ భూముల సాగు దారులుకు పందిపర్తి పొలం సర్వే నంబర్ 384 , సోమందేపల్లి పొలం సర్వే నంబర్ 744 లలో సాగుభూములు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నందు పెద్ద ఎత్తున వ్యక్తిగత అర్జీలు ఇవ్వడం జరిగింది. మంగళవారం సోమందేపల్లి మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ తాసిల్దార్ రెడ్డి శేఖర్, ఆర్ ఐ, విఆర్ఓ తో పాటు, మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప, టౌన్ ప్రెసిడెంట్ వద్దే సూరి, మాజీ ఎంపిటిసి కిష్టప్ప తదితరులు హాజరయ్యారు. సదస్సుకు పెద్ద ఎత్తున ప్రజల నుండి స్పందన లభించింది. సదస్సులో నక్కల గుట్ట కాలనీలో పునాదులు నిర్మించుకుని ఇళ్ళు నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేదలు ఇళ్లను ప్రభుత్వం నిర్మించాలని కోరారు. అదేవిధంగా సోమందేపల్లి గ్రామ దళితులకు స్మశాన వాటికకు సర్వే నంబర్ 7 నందు మూడు ఎకరాల భూమిని కేటాయించి సరిహద్దులు, కాంపౌండ్ వాల్ నీటి సౌకర్యం కల్పించాలని,మరియు సోమందేపల్లి బస్టాండ్ నందు నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగు దొడ్లను ప్రయాణికుల సౌకర్యార్థం వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అంతేగాక మండల కేంద్రంలో పలువంకలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని వాటిని పరిరక్షించి ప్రజావినియోగం లోకి తీసుకు రావాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు బెస్త కిష్టప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు రంగప్ప, గంగరాజు, ఆవాజ్ మండల అధ్యక్షులు మాబ, కళ్ళు గీత కార్మిక సంఘం మండల నాయకులు రామకృష్ణ, లబ్ధిదారులు వరలక్ష్మి, రామాంజనమ్మ, ముంతాజ్, మహేష్, జయమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ పింఛనుదారుల దినోత్సవం

**మడకశిర డిసెంబర్ 17 ప్రభాతవార్త**


పెన్షనర్‌ను సన్మానిస్తున్న ఎల్.మల్లికార్జున

జాతీయ పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా మడకశిర తాలూకా సింహగిరి పెన్షనర్స్ అసోషియేషన్ తరపున మంగళవారం మండల పరిధిలోని ఆమిదాలగొందిలోని శ్రీవేంకటేశ్వర వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని పెన్షన్ దారులందరి సమావేశంలో మడకశిర నిమోజకవర్గ పింఛనుదారుల అసోషియేషన్ అధ్యక్షుడు ఎల్.మల్లి కార్జున మరియు పెన్షనర్లు మాట్లాడుతూ పెన్షన్ సాధించిన పితామహుడు కీ॥శే॥ ధరమ్‌స్వరూప్‌నకార చేసిన కృషిని, సాగించిన పోరాటం చిరస్మరణీయం అని అతని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో 75 సంవత్సరములు వయస్సుగల పింఛను దారులందరికి ఎల్,మల్లికార్జున శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు శాంతవీరప్ప, ఉపాధ్యక్షుడు గణపతి, కార్యదర్శి ఫకృద్ధీన్, కోశాధికారి కెపి.రాజారావు మరియు పింఛనుదారులు పాల్గొన్నారు.

# సశ్యరక్షణతోనే అధిక దిగుబడి


పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిమర్రి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

ప్రతి రైతు సశ్యరక్షణ పనులను నిర్వహించినప్పుడు అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయ అధికారి రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం తాడిమర్రి మండలం ఏకపాదం పల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతుల సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు ఉధృతంగా ఉన్న దృష్ట్యా వైరస్ వ్యాప్తి చెంది మొక్క ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని దీని కొరకు విత్తనం విత్తే ముందు ఇమిక్లాక్‌విడ్ పురుగు మందుతో విత్తన శుద్ధి చేయడం వల్ల నెల రోజుల వరకు పురుగు ఆశించ కుండా చేయవచ్చున్నారు. అంతేకాకుండా రబి పంటల భీమా గురించి వివరించారు. ప్రభుత్వం నుంచి సబ్సిడి పొందాలంటే ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. ప్రతి రైతు తమ భూమిలో ఏ పంట వేస్తున్నది అధికారులకు తెలియజేసి ఎంపిఈఓల ద్వారా ఈ క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు విఎస్ఏ నాగేంద్ర, ఎంపిఈఓ విజయ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# భూములు లాక్కునేందుకు రియాల్టర్లు దౌర్జన్యం

**పెనుకొండ డిసెంబర్ 17 ప్రభాతవార్త**


భూములలో దౌర్జన్యంగా పాతిన సిమెంట్ పోల్స్‌ను తొలగిస్తున్న దృశ్యం

తమ భూములను లాక్కునేందుకు పలువురు రియాల్టర్లు గత కొన్ని ఏళ్లుగా తమపై దౌర్జన్యాలు దాడులకు పాల్పడుతున్నారని మండలంలోని దుద్దే బండ గ్రామానికి చెందిన దళితులు గోపాల్ ముత్యాలమ్మ లక్ష్మమ్మ గౌరమ్మ వెంకట లక్ష్మమ్మలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి దౌర్జన్యంగా తమకు తెలియకుండా గొ దింపల్లి గ్రామానికి చెందిన గ్రామానికి గోపాల్ రెడ్డి కుమారుడు అభిషేక్ ఆలియాస్ చిన్న తమ భూముల్లో కంచె వేసుకునేందుకు సిమెంట్ పోల్స్ ను నటించారన్నారు. దుద్దే బండ గ్రామ పొలంలో 454 సర్వే నెంబర్లు 16 ఎకరాల 87 సెంట్లు పొలం తమ పూర్వీకుల నుండి తమకు సంక్రమించిందన్నారు గత 50 ఏళ్ల క్రితం నుండి తాము సదరు భూములను సాగు చేసుకుంటూ జీవనం చేసుకుంటున్నామన్నారు. అయితే గత రెండేళ్లుగా దుద్దేబండ చంద్రగిరి అమ్మవారు పల్లి గ్రామాలకు చెందిన భూస్వాములు అగ్రకులాలకు చెందిన పలువురు వ్యక్తులు పలుసార్లు తమ భూములలో ఆక్రమించేందుకు పలుసార్లు యత్నించారన్నారు. భూస్వాముల దౌర్జన్యాలు దాడులపై పలసార్లు పోలీసులకు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం లేకపోయిందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని దళితులు పత్రిక ముఖంగా మొరపెట్టుకున్నారు

# విద్యుత్ పొదుపు పై అవగాహన ర్యాలీ

**హిందూపురం టౌన్ డిసెంబర్ 17 ప్రభాతవార్త**

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు 2024 లో భాగంగా హిందూపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. భూపతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. మంగళవారం స్థానిక ఎ డి కార్యాలయం నుంచి ప్రదర్శన ప్రారంభం చేశారు. డివిజన్ లోని ఉద్యోగుల తో విద్యుత్ పొదుపు పై గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా డివిజన్ ఆఫీస్ వరకు జరిగినది.

ర్యాలీ ముగింపు కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భూపతి మాట్లాడుతూ విద్యుత్ పొదుపు గురించి, మరియు సోలార్, పీఎం సూర్య ఘర్ కేంద్ర ప్రభుత్వ పథకం గురించి వినియోగ దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐదు నక్షత్రాల రేటింగ్ కలిగిన విద్యుత్ పరికరాలను వినియోగించాలని, ఎల్ఈడి బల్బులను వాడాలని, ఎలక్ట్రికల్ ఛార్జింగ్ వాహనాలను వినియోగించి కాలుష్యం నుంచి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. కార్యక్రమం లో ఎడి నాగన్న, జ్యోత్స్న, ఎఇ లు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల విద్యార్థినీలుకు అస్వస్థత

**- ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సవిత ఆరా**

**పెనుకొండ డిసెంబర్ 17 ప్రభాతవార్త**


చికిత్స పొందుతున్న విద్యార్థిని

మండలంలోని రాంపురం గ్రామంలోని గురుకుల పాఠశాలలోని 13 మంది విద్యార్థి నీయులు సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురయ్యారు. రాత్రి భోజనం చేసిన తదనంతరం అస్వస్థకు గురయ్యారు. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది హుటాహుటిన రాంపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు అందులో ఆరో తరగతి చదువుతున్న మహేశ్వరి కి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో పెనుగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు మిగతా 12 మంది విద్యార్థులు చికిత్స అనంతరం కోలుకున్నారు. సంఘటన తెలుసుకున్న రాష్ట్ర మంత్రి సవిత సంబంధిత పాఠశాల సిబ్బంది అధికారులతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. విద్యార్థులను హాస్టల్ నుండి బయటికి పంపించవద్దని హాస్టల్ సిబ్బందిని హెచ్చరించారు. మరోసారి ఇలా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి ఆమె తెలిపారు సంఘటన తెలుసుకున్న తహసిల్దార్ శ్రీధర్ మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు జరిగిన సంఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ జమునాబాయిని ప్రశ్నించారు విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు

# విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ

**- ఎంఇఓ జాన్‌రెడ్డప్ప చేతుల మీదుగా అందజేత**


స్వెట్టర్లను పంపిణీ చేస్తున్న దాతలు

**గోరంట్ల, డిసెంబర్ 17 పభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి జాన్ రెడ్డప్ప చేతుల మీదుగా విద్యార్థులకు స్వెట్టర్లను పంపిణీ చేశారు. మండల ఎంఇఓ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిలమత్తూరు మండల కేంద్రానికి చెందిన దాతలు రఘునాథబాబు, ఎస్.వరలక్ష్మి, లక్ష్మీకాంతమ్మ, రాజేశ్వరి, హైమావతి వారి తండ్రి జ్ఞాపకార్థం అనాధపిల్లలకు, ప్రత్యేక అవసరాలు గల 50 మంది పిల్లలకు స్వెట్టర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాజేష్, ట్రెజరర్ దస్తగిరి, నాగరాజు, సభ్యులు గిరిధర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, డికె శ్రీనివాసులు, శ్రీనివాసులు, నర్సరీ శీన, పద్మ, రేఖ, జయలక్ష్మి, మెడికల్‌స్టోర్ శివ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, ఈశ్వరమ్మ, చాంద్‌బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ తరుపున ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి మా వంతు కృషి చేస్తామన్నారు. అదే విధంగా లయన్స్‌క్లబ్ తరుపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

# భక్తజన సందోహం మధ్య అన్నమ్మదేవి, చౌడేశ్వరిదేవిల ఊరేగింపు


శ్రీఅన్నమ్మతల్లిని ఊరేగిస్తున్న దృశ్యం

**లేపాక్షి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మండలంలోని చోళసముద్రం గ్రామంలో మంగళవారం రాత్రి భక్తజన సందోహం నడుమ శ్రీఅన్నమ్మదేవి, శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. అన్నమ్మదేవికి లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రామానందన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై వుంచి చౌడేశ్వరి ఆలయం నుండి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు బ్రహ్మానందం మాట్లాడుతూ నేటి యువతలో భక్తి బావాలు పెంపొందించేందుకు ఇలాంటి పూజా కార్యక్రమాలు అవసరమన్నారు. ఇందులో భాగంగానే బెంగుళూరు నుండి అన్నమ్మదేవిని చోళసముద్రం గ్రామానికి తీసుకువచ్చి నాలుగు రోజుల పాటు వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో చోళసముద్రం గ్రామస్తులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బంగారుపాళ్యంలో సి సి రోడ్డు ఏర్పాటు


సీసీ రోడ్డు వేస్తున్న చేస్తున్న దృశ్యం

**అమరాపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని బంగారుపాళ్యం గ్రామానికి ప్రభుత్వం 10 లక్షల రూపాయల నిధులను సిసి రోడ్ ఏర్పాటుకు మంజూరు చేయడం జరిగిందని మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారుపాళ్యం తిప్పేస్వామి తెలిపారు. కొత్తగా గ్రామంలో ప్రజలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న మారమ్మ టెంపుల్ వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు కు మరియు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా గ్రామానికి కొత్తగా సిసి రోడ్డు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సౌకర్యం కలిగిందని వారు పేర్కొన్నారు.

# చింతఫల సాయం వేలం

**అమరాపురం డిసెంబర్17 ప్రభాతవార్త**

అమరాపురం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం నందు మంగళవారం పంచాయతీ పరిధిలోని చింత చెట్ల కొలసాయాన్ని ఈఓఆర్డి నాగముని ,గ్రామ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దనకుంట గ్రామానికి చెందిన దొడ్డ రంగప్ప అనే వేలంపాటదారుడు 1.12 లక్షల రూపాయలకు చింతపల సాయాన్ని వేలం ద్వారా దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి సుధాకర్ తెలిపారు.


వేలంపాట దృశ్యం

# జర్నలిస్టుల మినీ మహాసభను విజయవంతం చేద్దాం

**- ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య**


జర్నలిస్టుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు పుల్లయ్య

**బత్తలపల్లి, డిసెంబర్17 ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం పట్టణంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించనున్న జర్నలిస్టుల మినీ మహాసభను విజయవంతం చేద్దామని సత్య సాయి జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పుల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని గుండా కళ్యాణ మండపంలో ధర్మవరం డివిజన్ ఏపీయూడబ్ల్యూజే సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ పాటుపడుతుందన్నారు. రూ,20 లక్షలతో జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.వివిధ పత్రికలలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు నివేశ స్థలాలు, అక్రిడేషన్లు,విద్యార్థులకు ఉచిత విద్య,విలేకరులపై దాడులు తదితర అనేక సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మినీ మహాసభ ఏర్పాట్లు తీసుకోవలసిన చర్యలు,సభ విజయవంతానికి సబ్ కమిటీలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ధర్మవరం డివిజన్ అధ్యక్షులు మేడసాని మోహన్ ధర్మవరం డివిజన్ కార్యవర్గం గత నెల రోజులుగా చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు.ఈ సమావేశానికి జానపాటి మోహన్, జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, జిల్లా కోశాధికారి జీవి నారాయణ, డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి, జిల్లా నాయకులు రాము, ప్రసాద్, గౌరవ అధ్యక్షులు భాస్కర్ రెడ్డిలతో పాటు ధర్మవరం డివిజన్ కమిటీలో సభ్యులైన జర్నలిస్టులు హాజరైనారు.

# ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ


జిల్లా అధికారి, రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, డిశంబర్, 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మంగళవారం, జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా, ఆరోగ్య కేంద్రంలోని, సూపర్వైజర్లు లు, సి. ఎచ్. ఓ. అందరి రికార్డ్స్ పరిశీలించారు, మండలం లో మలేరియా కేసులు ఎన్ని, ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు, అలాగే , ఇకమీదట కేసులు రాకుండా చూడాలి అని సూచించారు,. గ్రామాలలో పరిసరాలను పరిసుభ్రాంగా ఉండేటట్లు చూడాలని,. గ్రామాలలో ఉన్న మన సిబ్బంది ప్రజల కు మలేరియా. డెంగీ.చికెంగునియా. జ్యారాలు రాకుండా, అవగాహనా కల్పించాలన్నారు,. ఈ కార్యక్రమం లో జిల్లా మలేరియా అధికారి తో పాటు, డాక్టర్ రవి నాయక్,,ధర్మవరం సుబ్యూనిట్ అధికారి జయరాం నాయక్,,గోవిందమ్మా. సి. ఎచ్. ఓ,,పద్మావతి. పి ఎచ్ ఎన్, వెంకటనారాయణ. సూపర్ వైసోర్స్, పాల్గొన్నారు.

# శిక్షణ తరగతులను తనిఖీ చేసిన అబ్జర్వర్ రూపారాణి



మాట్లాడుతున్న అబ్జర్వర్ రూపారాణి

**ధర్మవరం రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో శిక్షణ తరగతుల నిర్వహణ నాకెంతో సంతోషాన్ని సంతృప్తిని ఇచ్చిందని శ్రీకాళహస్తి ఈటిసి వైస్ ప్రిన్సిపాల్, అబ్జర్వర్ రూపారాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు రెండవ రోజు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆకస్మికంగా ఆమె తనిఖీ టీం అంశాలపై శిక్షార్తులను పలు ప్రశ్నలు వేయగా, సరి అయిన సమాధానాలు రావడంతో వారు సంతోషించారు. అంతేకాకుండా ప్రతి అంశంపై వారికి ఎంత మాత్రం అర్థం అయింది అన్న విషయాలపై కూడా ఆరాతీయడంలో సంతృప్తి చెందారు. వచ్చే 2025-26 సంవతసర్రం నాటికి మన ధర్మవరం మండల ప్రజా పరిషత్ కార ఆయలయం నేషనల్ లెవెల్‌లో పంచాయితీ అవార్డు పొందడానికి సంకల్పించడం, మీ కృషి ఎంతో స్లాగనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సాయి మనోహర్‌తోపాటు, శిక్షార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు మంగళకర విద్యార్థి

**పుట్టపర్తి రూరల్ డిసెంబర్ 17 ప్రభాతవార్త**

పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి మంగళకర విద్యాసంస్థలలో బీకాం చదువుతున్న సాయికుమార్ అనే విద్యార్థి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యారు. కేరళలోని తిరునంతపురం లోని యూనివర్సిటీ ఆఫ్ కేరళ జరగబోవు పోటీలలో ఈ విద్యార్థి ఎస్కే యూనివర్సిటీ జట్టు తరపున ఆడనున్నారు. ఈ విద్యార్థి ఎంపిక పట్ల మంగళకర విద్య సంస్థల మేనేజింగ్ ట్రస్టీ, కే సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ ఆర్య ప్రకాష్, ఏవో జై చంద్ర రెడ్డి, మంగళకర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు పిడి శ్రీనివాసులు, అధ్యాపక బృందం, విద్యార్థులు ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఫోటో ఎంపికైన విద్యార్థి సాయికుమార్.

# రైతులకు వాతావరణ భీమా

**బుక్కపట్నం డిసెంబర్ 17 ప్రభాతవార్త**

బుక్కపట్నం మండల ంలోని మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం వాతావరణ భీమా అవకాశం కల్పించిందని ఎకరాకు 1800 రూపాయల చొప్పున ఈ నెల 31వ తేదీలోపు సంబంధిత సచివాలయ అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ అసిస్టెంట్లతో సర్టిఫికెట్ మంజూరు చేసుకునిసి ఎస్సి సెం టర్ లేదా మీసేవ సెంటర్ నందు చెల్లించుకుని లబ్ధి చేకూ ర్చు కోవాలని తెలుగుదేశం పార్టీ బుక్కపట్నం మండల కన్వీనర్ చిం తామల్ రెడ్డి ప్రకటనలో తెలియజేశారు. ఈ అవకాశాన్ని మం దలంలోని ప్రతి మామిడి రైతు వినియోగించుకోవాలని తెలియజేశారు

# చెక్ డ్యామ్ కు మరమ్మత్తులు చేపడతాం

**బత్తలపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

బత్తలపల్లి చెరువులో ధ్వంసమైన చెక్ డ్యామ్ ను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపడతామని ఇరిగేషన్ మహేశ్వర్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ భవ్యలు పేర్కొన్నారు. మంగళవారం మండల టిడిపి నేతలతో కలిసి ఇరిగేషన్ అధికారులు ధ్వంసమైన చెక్ డామ్ ను పరిశీలించారు. బత్తలపల్లి చెరువుకు పీఏబీఆర్ కుడి కాలువ నుండి నీరు వస్తుండడంతో దెబ్బతిన్న చెక్ డ్యామ్ పరిశీలించి మరమ్మత్తు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ పరిశీలనలో క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, బత్తల మనోజ్, గుండుసాబ్ తదితరులు పాల్గొన్నారు

# హాస్టళ్లలోకి బయట ఆహారం రానివ్వొద్దు

**పెనుకొండ డిసెంబర్ 17ప్రభాతవార్త**



రాష్ట్ర మంత్రి సవిత

రాష్ట్ర వ్యాప్తంగా బీసీ హాస్టళ్ళ, గురుకుల పాఠశాలల్లోకి బయట ఆహారాన్ని తీసుకు రానివ్వొద్దని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖాధికారుల, హాస్టల్ సిబ్బందిని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. మంగళవారం మంత్రి సవిత ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సోమవారం రాత్రి సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం రాంపురం బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 13 మంది బాలికలు స్వల్ప అసస్థతకు గురయ్యారు. రాంపురం ప్రాథమిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందజేసిన అనంతరం మంగళవారం ఉదయం వారిని డిశ్చార్జి చేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సవితవిద్యార్థినులతోనూ, వైద్యులతోనూ, గురుకుల సిబ్బందితోనూ ఫోన్లో మాట్లాడారు. కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని మంత్రితో వైద్యులు తెలిపారు. విద్యార్థినులంతా కోలుకున్నారని, వారిని డిశ్చార్జి చేశామని వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం హాస్టల్ లోనే విద్యార్థినులు విశ్రాంతి తీసుకుంటున్నట్లు గురుకుల సిబ్బంది తెలిపారు. బాలికలను డిశ్చార్జి చేసినా హాస్టల్ లోనే వైద్యుల పర్యవేక్షలోనే ఉంచాలని, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితి నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. గురుకుల పాఠశాలల మిగిలిన విద్యార్థినుల పరిస్థితిపైనా మంత్రి ఆరా తీశారు. వారంతా బాగున్నారని, ఆదివారం కావడంతో, హాస్టల్ చుట్టు పక్కల ఉన్న షాపుల నుంచి కూడా ఆహార పదార్థాలను కొనుగోలు చేసి విద్యార్థినులు తిన్నారని తెలిపారు. అటువంటి వారే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. దీనిపై మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం చేశారు. హాస్టల్ లోకి బయట ఆహారం తీసుకురానివ్వొదని ఆదేశించారు. విద్యార్థినులను ఎట్టి పరిస్థితుల్లోనూ హాస్టల్ నుంచి బయటకు వెళ్లనీయొద్దని మంత్రి సవిత ఆదేశించారు.

# నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

**ధర్మవరం రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**


దుప్పట్లను అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

పట్టణంలోని గాంధీ నగర్‌లో గల శ్రీ సత్యసాయి సేవా సమితి పుట్టపర్తి బాబా ఆశీస్సులతో, దాతల సమాయ సహకారములతో దాదాపు 60 మందికి పైగా దుప్పట్లను పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి వారు మాట్లాడుతూ.. మానవసేవయే మాధవ సేవ అన్న సూక్తితో తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పేదలను ఆదుకొను, అనాధలకు, నిరాశ్రయులకు భోజనంతోపాటు ఇటువంటి దుప్పట్లు పంపిణీ చేయడం మాకెంతో సంతోషాన్ని తృప్తిని ఇచ్చిందని వారు తెలిపారు. అనంతరం అనాధలు నిరాశ్రయులు శ్రీ సత్యసాయి సేవా సమితి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

# చేనేతపట్టు రంగంపై కేంద్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ పరిశీలన


చేనేత పట్టు వస్త్రాలను పరిశీలిస్తున్న దృశ్యాలు

**ధర్మవరం రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

ఒకే జిల్లా-ఒకే ఉత్పత్తియే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం అని ఢిల్లీ నిపుణులు అర్పిథి గుప్తా, జాస్మిన్ కౌర్ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం పట్టు చీరలకు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగానే ధర్మవరంలో చీరల నిర్వహణ, తయారీపై పట్టణంలో ఈ నిపుణుల కమిటీ పరిశీలన చేయడం జరిగింది. తదుపరి పట్టు గుడ్డు నుంచి పట్టు చీర తయారీ వరకు అన్ని దశలను వారికి చేనేత తయారీదారులు చూపించి, వాటిని విశదీకరించడం జరిగింది. మొత్తం మీద వారి పరిశీలనలో ధర్మవరం పట్టు చీరలకు అవార్డు వచ్చే అవకాశాలు గల సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడి రామకృష్ణ, డిఓ రమణారెడ్డి, శీనానాయక్, సిరికల్చర్ అధికారులు, డిజైనర్ నాగరాజు, బిజెపి నాయకులు జింక చంద్రశేఖర్, చేనేత కార్మికులు సురేంద్రబాబు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి పూజ


అయ్యప్పస్వామి పూజ నిర్వహిస్తున్న మాలధార అయ్యప్పస్వాములు

**రామగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్యే పరిటాల సునీత స్వగృహంలో ఘనంగా అయ్యప్పస్వామి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలదార భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నిర్వహించారు.

# రోడ్డు విస్తరణ సమయంలో అక్రమ కట్టడాలు తొలగింపు

**- వార్త కథనానికి స్పందించిన ఈఓఆర్డి గూడన్న**

**కంబదూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మంగళవారం వెలువడిన ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కథనానికి ఈఓఆర్డి గూడన్న స్పందిస్తూ.. కంబదూరు చెక్‌పోస్టు, ఎంపిడిఓ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో బంకులు ఏర్పాటు చేసిన వారికి వారం రోజుల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పన్ను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఈఓఆర్డి గూడన్న తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు జరిగినప్పుడు అక్రమ కట్టడాలను తొలగిస్తామని తెలియజేశారు.

# ఆటోను ఢీకొన్న బస్సు ఒకరికి తీవ్ర గాయాలు

**బత్తలపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

మండలంలోని రాఘవంపల్లి బస్ స్టాఫ్ సమీపంలో మంగళవారం ఆటోను బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని రాఘవంపల్లి నుండి బత్తలపల్లికి ఆటో వస్తోంది. ఇదే సమయంలో అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న బస్సు ఆటోను ఢీ కొంది ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ సమయంలో ఆటోలో ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# నేడు విద్యుత్ అంతరాయం

**రామగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త**

రామగిరి మండల వ్యాప్తంగా బుధవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎఈ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనులు కారణంగా ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈ తెలిపారు.

# ఎస్‌వి డిగ్రీ కళాశాల క్రికెట్ టోర్నమెంట్

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

ఎస్వి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్కే యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆర్డటి మైదానంలో నిర్వహించడం జరిగింది. అందులో వివిధ కళాశాల క్రీడా జట్లు పాల్గొన్నాయి. మొదటి మ్యాచ్ ఉదయం 8 గంటలకు ఎస్ఎస్‌బిఎన్, పివికెకె మధ్య జరిగిన పోరులో ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల 157 పరుగులతో గెలుపొందింది. రెండవ మ్యాచ్‌లో జిడిసి తాడిపత్రి, ఎస్ఎస్ఎన్ కదిరి మధ్యజరిగిన పోరులో జిడిసి తాడిపత్రి 10 వికెట్స్ తేడాతో గెలుపొందింది. మూడవ మ్యాచ్ శ్రీవివేకానంద ఎటిపి, ఎస్కేపి జిడిసి గుంతకల్ మధ్య జరిగిన పోరులో శ్రీవివేకానంద ఏటిపి గెలుపొందింది. నాల్గవ మ్యాచ్ ఎస్ఎస్‌జిఎస్ డిసి గుంతకల్, ఎస్వి జిఎం జిడిసి కెఎల్‌డి మధ్య జరిగిన పోరులో ఎస్ఎస్‌జిఎస్ డిసి గుంతకల్ 17 పరుగుల తేడాతో గెలుపొందింది. ఐదవ మ్యాచ్‌లో బ్లూ మూన్ డిసి కదిరి, పరిటాల డిగ్రీ కళాశాల పెనుకొండ మధ్య జరిగిన పోరులో బ్లూ మూన్ డిసి కదిరి89 పరుగుల తేడాతో గెలుపొందింది. ఆరవ మ్యాచ్ లో జిఓవిటి డిసి ఎటిపి, జిడిసి ఉరవకొండ మధ్య జరిగిన పోరులో జిడిసి ఎటిపి 7 వికెట్స్ తేడాతో గెలుపొందింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డా.బి.జెస్సీ సెక్రెటరీ స్పోర్ట్స్ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డా.ఎన్‌ఏవి ప్రసాద్, సెక్రెటరీ ఎం.శ్రీనివాసులు నాయక్, వివిధ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరామ్, జయరాం, ప్రసాద్ క్రికెట్ క్రీడా కారులు, వివిధ అధ్యాపకులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ ఆడుతున్న క్రీడాకారులు

## పోర్టబుల్ కుర్చీల వితరణ

పామిడి,

డిసెంబర్ 17 ప్రభాతవార్త

ప్రభుత్వ టిసి ఉన్నత పాఠశాలలో సామాన్యశాస్త్రం, ఎన్‌సిసి మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు మంగళవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రెండు పోర్టబుల్ కుర్చీలు వితరణ చేశారు. సంపాదించిన దానిలో కొంత ప్రజాప్రయోజనాలకు వినియోగించటం ద్వార మానవ జన్మకు సార్థకం ఏర్పడుతుందని ఎన్‌సిసి మాస్టర్ రామాంజనేయులు తెలియజేస్తూ నిరుపేద ప్రజ లకు వైద్యసేవలను అందిస్తున్న వైద్యుల సౌకర్యార్థం నావంతు సహాయంగా సిహెచ్‌సికి రెండు పోర్టబుల్ కుర్చీలను వితరణ చేయటం జరిగిందన్నారు. ఎన్‌సిసిసి మాస్టర్ సిహెచ్‌సికి రెండు పోర్టబుల్ కుర్చీలను వితరణ చేసి తన సేవా నిరతిని చాటుకోవటం శుభపరిణామం అని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి వెల్లడించారు.



కుర్చీలను వితరణ చేస్తున్న ఎన్‌సిసి మాస్టర్ రామాంజనేయులు

## నేడు జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రీ క్రిస్మస్ వేడుకలు

### జిల్లా అధ్యక్షులు నెహేమ్యా రెడ్డివారి నాగరాజు.

అనంతపురం రూరల్,డిసెంబర్17ప్రభాతవార్త:

అనంత జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు అనంత రూరల్ మండలం రాచానపల్లి పంచాయితీలో గల యేసుకృపా మందిరం వద్ద ఫ్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నెహేమ్యా రెడ్డివారి నాగరాజు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫ్రీ క్రిస్మస్ వేడుకలకు అనంత జిల్లాలోనిఅనంతఅర్బన్, రాప్తాడు,సింగనమల, తాడిపత్రి,కళ్యాణ్‌దుర్గం, రాయదుర్గ్ ం,ఉరవకొండ,గుంతకల్లు నియోజకవర్గంలోని పాస్టర్లు వారు కుటుంబాలతో సహ విచ్చేయడం జరుగుతుందన్నారు. ఈ ఫ్రీ క్రిస్మస్ వేడుకలకు విచ్చేసిన పాస్టర్స్ కుటుంబాలకు అదే విధంగా 500 పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు,దుస్తులు,మరియు కానుకలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈ ఫ్రీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య ప్రసంగీకులుగా దేవుని సేవకులు గాడ్లి,రాజకీయ నాయకులు,క్రైస్తవ సంఘ నాయకులు,విశ్వాసులు హాజరూకావడం జరుగుతుందన్నారు.

## శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ధనుర్మాస పూజలు

పామిడి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం నందు మంగళవారం ధనర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. వేకువజామునే భక్తులు దేవాలయానికి చేరుకుని తిరుప్పావై పాశురాన్ని పాటించారు. భగవద్గీత పారాయణం, స్తోత్ర పారాయణం గావించారు. కృష్ణ విశ్వరూప సందర్శన చిత్రప టాన్ని గోదాదేవి శ్రీకృష్ణుల విగ్రహాలను సుగంధ పుష్పాలతో లంకరించి అష్టోత్తర పూజలు చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం చేసి గోదాదేవిగా పూజించారు. మహామంగళహారితి గావించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజజేశారు.



శ్రీ కన్యకా పరమేశ్వరి, శ్రీకృష్ణుల విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అష్టోత్తర పూజలు.

## ఈ నెల 30 లోపు పంటలకు ప్రీమియం చెల్లించాలి

### చిన్నంపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

అనంతపురం రూరల్,

డిసెంబర్ 17 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలంలో పంటలు వేసిన ప్రతి రైతు రబీ పంటలకు నమోదు చేసుకుని రబీ క్రాప్ కోసం ఈ నెల 30 వ తేదిలోపు వారు వేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఉమా మహేశ్వరమ్మ.ఏడిఎ రవి రైతులకు తెలియజేశారు. మంగళవారం అనంత రూరల్ మండలం కురుకుంట,చిన్నంపల్లి పంచాయితీలోని రైతు సేవా కేంద్రాల సమీపంలోని రైతుల పొలాల్లో ఏఓ శశికళ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిజిల్లా వ్యవసాయశాఖ అధికా రిని ఉమామహేశ్వరమ్మ.ఏడిఎ రవి హాజరై రైతులు వేచిన కంది, వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులకు వేరుశెనగ,కంది పంటలలో వచ్చు చీడ పీడల నివారణకు గల సస్యారక్షణ చర్యల గురించి సలహాలు, సూచనలు చేసి రైతల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రైతులు వేసిన పంటలకు సంబందించి వరికి రూ.630,టమోటాకు రూ.1600, మామిడికి రూ.1650 ఎకరాకు ప్రీమియం బ్యాంక్‌లో చెల్లించాల న్నారు.ఈ కార్యక్రమంలో చిన్నంపల్లి సర్ప ంచ్ శివశంకర్,ఏఈఓ మురళీకృష్ణ, అనుపమా,రామాంజినేయులు, రైతు సేవా సిబ్బంది సంధ్య, నిర్మాల, ఇతర శాఖ సిబ్బంది టిడిపి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నంపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార్లదిన్నె డిసెంబర్ 17,ప్రభాతవార్త :

గార్లదిన్నె మండలం కల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం సబ్స్టేషన్ మరమ్మత్తుల పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వర కు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు.. కల్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని ఉన్న రైతు లు, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## సుస్థిర అభివృద్ధిపై శిక్షణ తరగతులు

గార్లదిన్నె,

డిసెంబర్ 17 ప్రభాతవార్త :

స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ యోగనంద రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సుస్థిర అభివృద్ధి పై శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళవారం ఎంపిడిఓ యోగనంద రెడ్డి మాట్లాడారు. శాస్విత పనులు, వాటి లక్ష్యాలపై శిక్షణ కల్పించారు..ఈ శిక్షణలో విలేజ్ సర్వే అసిస్టెంట్స్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్స్, వెటర్నరీ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఎనర్జీ అసిస్టెంట్స్ హాజరయ్యారు..



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

## హిందువులందరూ సంఘటితం కావాలి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన హిందువులు

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

కులమతాలకు అతీతంగా హిందువులందరూ హైందవ జాతి కోసం పోరాడాలని విశ్వహిందూ పరిషత్ లక్ష్మణ్ పిలుపుచ్చారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైందవ శంఖారా వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశాన్ని నిర్వహించారు. నగరంలోని పాతూరు నందుగల అమ్మవారిశాలలో విశ్వహిందూ పరిషత్ ప్రచారక్ వి లక్ష్మణ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు తాళంకి వెంకట రత్నమయ్య, చిన్మయ మిషన్ ఆత్మవిదానంద, పాతవూరు ఆలయ ధర్మకర్త పిన్ని నాగరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హైందవ జాతిలో కులాల పేరుతో వేరువేరుగా ఉండడం వల్లనే అన్యమతస్తులు హైందవ జాతిని కించపరు స్తున్నాయి. కుల మతాలకు అతీత ంగా అందరూ ఒకే తాటి పై నిలబడినప్పుడు ఎవరు హైందవ సంప్రదాయాలను వేలెత్తి చూపరు. హిందూ దేవాలయాలలో దేవాలయ శాఖ ఆధిపత్యం తగ్గించాలి. దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. జనవరిలో విజయవాడలో నిర్వహించే విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావానికి అర్చకులు, పండితులు ఆలయ ధర్మకర్తలు, హిందూ భక్తులు హిందువులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యదర్శి వెంకట రమణ బాబు విశ్వనాథ రెడ్డి కిశోరనాయుడు హిమా కర్ జగదీశ్ వీరాంజనేయులు హిందూ చైతన్య వేదిక విశ్వేశ్వరరెడ్డి శబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## జాతీయ మానవ హక్కుల సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా లక్ష్మణ్



రాష్ట్ర జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

జాతీయ మానవ హక్కుల సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా అనంతపురం పట్టణా నికి చెందిన వి.లక్ష్మణ్‌ను నియ మించారు. ఈ సందర్భంగా లక్ష్మ ణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మ కం ఉంది, ఈ పదవికి ఎంపిక చేసినందుకు సీఈఓ తూము రామచంద్రనా యుడుకు,జాతీయ వైస్ చైర్మన్ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బిఎస్.కృష్ణారెడ్డికు కృతజ్ఞతలు తెలియజేశారు. మానవ హక్కులపై నిరంతరం కృషి చేస్తామని, న్యాయం కోసం పోరాడుతామన్నారు.

## గౌడ్ కులస్తుల రాజకీయ భవిష్యత్తును అడ్డుకుంటే తగిన బుద్ధి చెబుతాం



మాట్లాడుతున్న ఈడిగ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ గౌడ్, తదితరులు

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

గౌడ్ కులస్తుల రాజకీయ భవిష్యత్తును అడ్డుకుంటే తగిన బుద్ధిచెబుతామని ఈడిగ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ గౌడ్, శ్రీరేణుకా యల్లమ్మ సొసైటీ అధ్యక్షులు జగలేటి నాగేశ్వరరావు గౌడ్, టిసిఎస్ ప్రెసిడెంట్ రఘురామయ్యగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జోగి రమేష్, గౌతు శిరీష, కొనకల్ల నారాయణ, గౌడ్ కులస్తులు కాబట్టే అందరూ కలవడం జరిగిందని, కుల సంఘాల మీటింగ్‌కు, స్వాతంత్ర సమర యోధుల జయంతి వర్ధంతిలకు, కుల బంధువుల శుభ, ఆశుభ కార్యక్రమాలకు, పార్టీలను అంటగట్టడం దుర్మార్గమైన చర్య అని, గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణను రాజకీయం చేయడం తగదన్నారు. ఇతర క ఉలస్తులు కలిసినప్పుడు రాని సమస్య కేవలం గౌడ్ కులస్తులు కలిసినప్పుడు మాత్రమే వస్తుందా అని ఆయన ప్రశ్నించారు. కొంత మంది ఉద్దేశ్య పూర్వకంగా ప్రజాప్రతినిధులను దూషిస్తూ రాజకీయం చేస్తూ శునకానందం పొందారన్నారు. ఇలా చేస్తే తమ అవేశానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోగౌడ సంఘం నాయకులు స్వరూప్‌కుమా ర్‌గౌడ్, నారాయణ స్వామి, రమణ గౌడ్, సోమలదొడ్డి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎల్‌సి సౌత్‌కెనాల్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్‌గా చంద్రశేఖర్‌నాయుడు

### - అభినందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల,

డిసెంబర్ 17 ప్రభాతవార్త

హెచ్ఎల్‌సి సౌత్‌కెనాల్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్‌గా ఎన్నికైన చంద్రశేఖర్‌నాయుడు ఎంపిక య్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మె ల్యే బండారు శ్రావణిశ్రీని కలిసి చంద్రశేఖర్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హెచ్ఎల్‌సి సౌత్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీచైర్మన్‌గా ఎంపికైన గార్లదిన్నె మండలానికి చెందిన చంద్రశేఖర్‌నాయుడును, వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన శింగనమల మండలానికిచెందిన చెంద్రాయుడుని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, నారాయణస్వామి, రామకృష్ణ, చౌదరి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



చంద్రశేఖర్ నాయుడుని అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

## అగాపే ఆశ్రమంలో సివిఆర్ అన్నదానం

యాడికి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

యాడికి మండల కేంద్రంలోని కమలపాడురోడ్డు, రాఘవేంద్రకాలనీలో వున్న అగాపే ఆశ్రమంలో రాయలచెరు వులోని ప్రముఖ పారిశ్రామికవేత్త సివి రమణారెడ్డి 65వ పుట్టినరోజును జరు పుకున్నారు. ఆపదలో వున్న వారిని అదుకో వడమే కాకుండా ఆనందాన్ని కూడా అందరితో పంచుకోవాలనే భావన, అలాంటి వ్యక్తిత్వం వున్న వ్యక్తి తన పుట్టినరోజు సందర్భంగా అగాపే ఆశ్రమంలో దివ్యాంగులకు, వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సతీమణి హరికృప, కుమారుడు ప్రణయ్‌రెడ్డి, కోడలు తేజస్విని, కుమార్తె ప్రియాంక, అల్లుడు ప్రనూస్, కుటుంబసభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వృద్ధులు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసి వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియచేశారు.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

## రాష్ట్ర క్లాస్ ఫోర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వివిధ ప్రభుత్వ శాఖలకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు దివాకర్, సోమశేఖర్లకు సన్మానం

అనంతపురం, డిసెంబర్ 17, (ప్రభాతవార్త బ్యూరో) ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం అనం తపురం జిల్లా శాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నూతనంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన దివాకర్ రావు,జి సోమశేఖర్‌లను పలువురు నేతలు, ఉద్యోగులు శాలువాలతోను పూలదండలతోనూ ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ వెంకటరమణ ,జిల్లా సహాయ అధ్యక్షులు పి వెంకట్రామిరెడ్డి ,అనంతపురం నగర క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ కార్యదర్శి ఎస్ జాఫర్ వలి తదితరులు పాల్గొన్నారు. జిల్లా జేఏసీ అమరావతి అసోసియేషన్ పక్షాన రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు గారి నాయకత్వంలో అనంతపురం జిల్లాకు సమైక్యాంధ్ర ఉద్యమంలో అగ్రభాగాన నుంచి వేలాదిమంది ఉద్యోగస్తులకు నాయకత్వం వహించి ఎన్నో రోజుల పాటు పోరాట బాట వహించిన దివాకర్ రావు , సోమశేఖర్ లు అనంతపురం రెవిన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఆదివారం నాడు జరిగిన ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సమావేశంలో పలువురు హర్షం ప్రకటిం చారు. అనంతపురం జిల్లా పోలీస్ బెటాలియన్ అధ్యక్షు లు తలారి పెద్దయ్య, ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండరామిరెడ్డి, ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ సాంబశివుడు ,అనంత పురం జిల్లా డిసిహెచ్ఎస్ ఎం ప్లాయిస్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, మహిళా ఉద్యోగ సంఘాల నాయకులు కవిత, విభారతమ్మ , తదితరులు దివాకర్ రావు, సోమశేఖర్ చేసిన సేవలను సమావేశంలో కొనియాడారు.



ఉద్యోగుల సంఘం నేతలను సన్మానిస్తున్న దృశ్యం

## కౌన్సిల్ సమావేశంలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం కల్చరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

అనంతపురం నగర పాలక సంస్థలో మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా నగర పాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 309 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జిఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచటానికి, కార్మికులు కౌన్సిల్‌లో తీర్మాణం జరిగింది. అందులో భాగంగా కౌన్సిల్‌కు హాజరైన అర్బన్ ఎమ్మెల్యేకి, మేయర్, డిప్యూటీ మేయర్లకు 50 డివిజన్ల కార్పోరేటర్లకు, స్టాండింగ్ కమిటీ సభ్యులకు జిఓ నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచటానికి అందరూ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తీసుకెళ్తామన్నారు. అందుకు ప్రతి ఒక్కరికి ఇంజినీరింగ్ కార్మిక నాయకులైన వి.ఎస్.రాయుడు, వి.మల్లికార్జు న,సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, ఒకటవ పట్టణ కార్యదర్శి, వెంకటనారాయణ, రెండవ పట్టణ కార్యదర్శి ముత్తూ జా, నగర అధ్యక్షులు ఎం. ఓబుళపతి, ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహన్, కోశాధికారి ఎం. పోతులయ్య, ఇంజినీరింగ్ కార్మికులు, పాల్గొని ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్యేకు, కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న దృశ్యం

## వాటర్‌షెడ్ చైర్మన్‌గా దాదులూరు కృష్ణరెడ్డి

శింగనమల,

డిసెంబర్ 17 ప్రభాతవార్త

మండల పరిధిలోని వెస్ట్ నర్సాపురం గ్రామ పంచాయితీలో వాటర్‌షెడ్ చైర్మన్‌గా దాదులూరు కృష్ణారెడ్డి ఎంపికైనందుకు కృతజ్ఞతగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిని కలిసి పూల బొకేను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ చైర్మన్‌దాదు లూరు కృష్ణరెడ్డి, మాజీ జడ్పిటిసి శాలిని, మాజీ మండల కన్వీనర్‌చితంబర దొర, వీరనారప్పతను, గుర్రం లక్ష్మినారాయణ, విశ్వనాథ్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటరమణ, నారాయణ స్వామి, నల్లయ్య, ఓబుళపతి, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలుపెద్ద ఎత్తున హాజరయ్యారు.



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో టీడీపీ నేతలు

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### జివిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బి.రాంప్రసాద్‌నాయక్

తనకల్లు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

మండలంలో ఉన్న గురుకుల పాఠశాలలో ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు, వంట మనుషులు, చీపర్లు, వాచ్మెన్లను మరియు ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ ఔట్సోర్సింగ్ పనిచేస్తున్న వారిని రెగ్యూలర్ చేయా లని జివిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బి.రాంప్రసా ద్‌నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మండలంలో కొన్ని స్కూళ్ల పరిశీ లించి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ సమస్యలపై ప్రభుత్వం స్పందించి సమాన పనికి సమాన వేతనం, హెచ్‌ఆర్ పాలసీ ఔట్సోర్సింగ్ రెగ్యులర్ చేయాలని, వెం టనే 12వ పిఆర్సి అమలు చేయాలని, 26జిల్లాలో ఔట్సోర్సింగ్ పని చేస్తు న్న సాదక బాధలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి విజ్ఞపినత చేస్తూ ఔట్సోర్సింగ్‌లో ఉన్న వీరిని కాంట్రాక్ట్ పద్ధతిలోకి న్యాయం చేయాలని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయారని, కాబట్టి వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ సమస్యలపై స్పందించాలని తమ డిమాండ్ సాధన కోసం గత 31రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. ఈ సమ్మె కారణంగా విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి సమస్యలు వెంటనే పరిష్కరిం చా లని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయాలని విన్నవించుకొంటున్నట్లు ఆయన కోరారు.



బి.రాంప్రసాద్‌నాయక్

## కల్లుమడిలో రెవెన్యూ సదస్సు



మాట్లాడుతున్న తహశీల్దారు బ్రహ్మయ్య



ర్యాలీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

శింగనమల, డిసెంబర్ 17 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కల్లుమడి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా నియోజక వర్గ ప్రత్యేక అధికారి జహీర్ అస్లామ్, తహశీల్దారు బ్రహ్మ య్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. భూ సమస్య సమస్యల పరిస్కార వేదిక రెవెన్యూ సదస్సులని ప్రజలందరూ ఈ సమస్యలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నిర్మలాకుమారి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, ఎంపిటిసి నల్లప్ప, ఓబిరెడ్డి, డిప్యూటీ తహశీల్దారు పునీత్‌కుమార్, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## ఆలూరుకోనలో ధనుర్మాసం పూజలు

తాడిపత్రిరూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

మండలంలోని ఆలూరుకోనలో ధను ర్మాసం పూజలు ప్రారంభమయ్యా యి. ఇందులో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగ నాథ స్వామికి ఉదయం అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్ర మాలు నిర్వహించి అనంతరం వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనే యస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు కోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. దీపకాంతుల నడుమ స్వామివారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజినేయులు, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.



శ్రీరంగనాథస్వామిని అలంకరించిన దృశ్యం

## నూతన ఆయకట్టు చైర్మన్లకు ఘన సత్కారం

శింగనమల, డిసెంబర్ 17

ప్రభాతవార్త

ఇటీవల సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన శింగనమల ఆయకట్టుచైర్మన్ బోయ సత్యనారాయణ, తరిమెల ఆయకట్టుచైర్మన్ చెంద్రాయుడులను మంగళవారం జిల్లా కేంద్రంలోని హెచ్ఎల్‌సి కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు శాలువాతో సత్కరించి, పూల బొకేలను అందించి శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, ఆకుల బాబు, రామకృష్ణ, పట్నం నగేష్, బండి పరుశురామ్, కాయల రమణయాదవ్, ఆదినారాయణ, చిన్న ఆంజినేయులు, సురేష్, గంగాధర్, వీరాంజినేయులు, అనిల్‌కుమార్, కుళ్లాయప్ప, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆయకట్టు చైర్మన్లను సన్మానిస్తున్న తెలుగు తమ్ముళ్లు

## ప్రీమియం మద్యం స్టోర్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఓల్డ్ టౌన్ డిసెంబర్ 17 ప్రభాతవార్త నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రీమియం మద్యం స్టోర్లు ఏర్పాటు చేయడానికి ఎక్సైజ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని అనంతపురం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాల కాల వ్యవధితో ఏర్పాటు చేయబోయే ప్రీమియం స్టోర్ లకు ఈనెల 17వ తేదీ నుండి డిసెంబర్ 31 తారీకు వరకు ఆన్లైన్ ఆఫ్లైన్ పద్ధతి లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఈ దరఖాస్తులు సూపరిండెంట్ కార్యాల య ంలో మాత్రమే అందజేయాలని సూచించారు. స్టోర్‌కు దరఖాస్తు చేయబోయే దరఖాస్తుదారులు 15 లక్షలు నాన్ రీఫాడబుల్ ఫీజులు చెల్లించాలని అలాగే స్టోర్ లైసెన్స్ ఫీజు కోటి రూపాయలుగా నిర్ణయించారని తెలిపారు ప్రీమియం స్టోర్ ఏర్పాటు చేయడానికి కనీసం 4000 చదరపు అడుగుల వాణిజ్య వ్యాపార సముదా యాన్ని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రీమియం స్టోర్ ఏర్పాటు చేయడానికి లైసెన్స్‌ను లాటరీ పద్ధతి ద్వారా కేటాయి స్తామనిమన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### - జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్

నల్లమాడ,

డిసెంబర్ 17 ప్రభాతవార్త,

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీ సత్యసాయి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్ సూచించారు. ఈ నెల 13,14వ తేదీన ఒడీసీ లో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి జూనియర్ జంప్ రోప్‌లో తొమ్మిది బంగారు పథకాలు, ఓ కాంస్య పతకం సాధించిన స్థానిక ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మోహన్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగి విద్యార్థులు చదువులో మరింత రాణించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో కూడ క్రీడాకారులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 సురేష్. పాఠశాల హెచ్‌ఎం సతీష్, వార్డెన్ సత్యనారాయణ, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందిస్తున్న జిల్లా అధికారి మోహన్ రామ్

## ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న సమర్పణ..

ఆలయ ధర్మకర్త గురుస్వామి లింగమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు.. అనంతపురం ఓల్డ్ టౌన్ డిసెంబర్ 17 ప్రభాతవార్త అనంతపురం హెచ్ ఎల్ సి కెనాల్ వద్ద వెలిసిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళ వారం ఆలయ ధర్మకర్త గురుస్వామి లింగమయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అయ్యప్ప స్వామిని నయన మనోహరంగా అలంకరించారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు అన్న సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, అయ్యప్ప స్వామి మాలదారులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

B.DHARSHAN (old name) S/o SHAIK JAVID, D.No: 12-604-1, Sainagar 4th cross, ANANTAPUR do here declare that I have changed my name from B DHARSHAN (old name) to **SHAIK SAMEER** (New Name). Hence forth, my name being called as **SHAIK SAMEER** for all purposes.

**CHANGE OF NAME**

B.RITIKA (old name) D/o SHAIK JAVID, D.No: 12-604-1, Sainagar 4th cross, ANANTAPUR, do here declare that I have changed my name from B.RITIKA (old name) to **SHAIK SUMIYA** (New Name). Hence forth, my name being called as **SHAIK SUMIYA** for all purposes.

**CHANGE OF NAME**

I, **TUMMALA MOHAMMED ALI** (Old Name) Residing at D.No-1-73-6A, Mohiyar Nagar, Kadiri Town, Sri Satya Sai District AP - 515 591. do hereby declare that I have changed my name From TUMMALA MOHAMMED ALI (Old Name) to **TUMMALA SHAIK NOWSHAD ALI** (New Name) hence forth my name being called as **TUMMALA SHAIK NOWSHAD ALI** for all purposes S/o TUMMALA EBRAHIM SAHIB.

**CHANGE OF SURNAME**

I, **BORUGULA SREELATHA** (Surname & given name), R/o 18-230, UMA NAGAR, OLD TOWN, ANANTAPUR (T & D), AP. I have change my Surname from BORUGULA SREELATHA to **VENNAPUSA SRI LATHA**, hence forth my Surname & Name known as **VENNAPUSA SRI LATHA** W/o **BORUGULA KARUNAKAR REDDY** for all purpose

04ATP17_04ATP17.qxd 17-12-2024 PM 11:41 Page 1



# గతంలో లాగా నిర్లక్ష్యంగా ఉండొద్దు

## రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని సహించేది లేదు - బండమీదపల్లి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పరిటాల సునీత - సీపీ రోడ్లు, గోకులం షెడ్లను ప్రారంభించిన సునీత

రాప్తాడు డిసెంబర్ 17 ప్రభాతవార్త

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉండేది చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేగా ఉన్నది పరిటాల సునీత అన్నది మర్చిపోవద్దన్నారు. గత ప్రభుత్వంలో లాగా ఇష్టానుసారం రైతుల్ని, ప్రజల్ని ఇబ్బందులు పెడుతుంటే చూస్తూ ఊరుకోమన్నారు. రాప్తాడు మండలం బండమీదపల్లి పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులతో కలసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా మ్యుటేషన్స్, సర్వే సమస్యలతో పాటు రస్తా వివాదాలు, ఆన్ లైన్‌లో మార్పులు చేర్పులు, భాగ పరిష్కారాలలో తలెత్తిన వివాదాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని.. ఏదో మొక్కుబడిగా అర్జీలు స్వీకరించాం.. అయిపోయిందన్నట్టుగా ఉండకూడదన్నారు. గ్రామాల్లో రైతులు కూడా చిన్న చిన్న సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అలా కాకుండా ఒక్కసారి పరిష్కారం కాలేదని కోర్టులకు వెళ్తే ఇరువురు నష్టపోతారన్నారు. దీని వలన సమయం వృథా అవుతుందన్నారు. గత ప్రభుత్వంలో అధికారుల నిర్లక్ష్యం వలన సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇక నుంచి రెవెన్యూ అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం వహించిన తగిన చర్యలు ఉంటాయన్నారు. భూసమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సీరియస్ గా ఫోకస్ పెట్టారని.. ఏ చిన్న తప్పును కూడా ఉపేక్షించేది ఉండదన్నారు. ఆన్ లైన్‌లో తప్పిదాలను వెంటనే సరిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో కక్షపూరితంగా రేషన్ కార్డులు, పింఛన్లు తొలగించారని అలాంటివన్నీ త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. మరో వైపు ఇళ్ల స్థలాలు లేని వారికి కూడా త్వరలోనే పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇస్తామన్నారు. గ్రామంలో ధ్యాన మందిరం కోసం స్థలం కావాలని అడిగారని.. అనువైన ప్రాంతంలో ఐదు సెంట్ల స్థలం సేకరించాలని తహసీల్దార్‌కు సూచించారు...సీపీ రోడ్లు, గోకులం షెడ్లు ప్రారంభంబండ మీదపల్లి గ్రామంలో 25లక్షల ఎన్ఆర్ఈ జీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. స్థానిక నాయకులు, అధికారుల తో కలిసి రోడ్డు నిర్మాణ తీరుపై ఆరా తీశారు. అలాగే 2.30లక్షలతో నిర్మించిన గోకులం షెడ్లను కూడా ఆమె ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు కనిపిస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువగా నిధులు తీసుకొచ్చి.. గ్రామాల్లో అవసరమైన పనులు చేపడుతామన్నారు.


గోకులం షెడ్లను ప్రారంభించిన ఎంఎల్ఏ పరిటాల సునీత

# అటవీ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

సత్య సాయి జిల్లా వైద్యము డిసెంబర్ 17 ప్రభాతవార్త:

జిల్లాలో అటవీ శాఖ ద్వారా ఉపాధి హామీ పనులు, నగరవనం సుందరీకరణ మొక్కలు నాటే కార్యక్రమం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ అటవీ శాఖ అధికారులతో మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జిల్లా కలెక్టర్ల సదస్సులో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించడం జరిగిందని ఇందులో ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్య సాధన మరియు జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ నాటికి శ్రీ సత్యసాయి జిల్లాను 50 శాతం గ్రీనరీ సాధించాలన్న లక్ష్యాన్ని జరిగిందని అందువల్ల అటవీశాఖ అధికారులు రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో నిర్దిష్ట ప్రణాళికా చర్యలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా 2025 2026 సం" దాదాపు 35 లక్షల నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అడవుల్లో భూసార పనులైన (ఎస్ఎంసి) కాంటూరు కందకాలు, ర్యాక్ ఫీల్డ్ డ్యాములు, చిన్న చిన్న నీటి గుంటలో మొదలగు పనులు చేపట్టాలన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి ఒక నగర వనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎక్కడైనా రెవెన్యూ భూముల్లో చెట్లతో కూడిన రెవెన్యూ కొండల్లో కూడా అవసరమైన చోట నగరవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. 202530 వరకు అటవీ కరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా నుంచి వెళుతున్న అన్ని హైవే ప్రాంతాలలో కూడా రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని అటవీ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, సామాజిక వన విభాగం అధికారి వినోద్ కుమార్, సబ్ డిఫ్ ఓ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

# ఈవిఎం గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవిఎం గోడౌన్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎంలను భద్రపరిచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవిఎం గౌడౌన్‌లో అంతర్భాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అందరి సమక్షంలో ఆయా ఈవిఎం గోదాము లోపల భద్రపరిచిన ఈవిఎం యంత్రాలు, భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, తహశీల్దార్ హరికుమార్, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, ఎన్నికల విభాగం డిప్యూటి తహశీల్దార్ కనకరాజ్, డిప్యూటి తహశీల్దార్ దివాకర్‌రావు, బి జెపి ప్రతినిధి ఈశ్వర్‌ప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్‌వలి, వైసిపి ప్రతినిధి శ్రీనివాసులు, బిఎస్‌పి అంజయ్య, టిడిపి ప్రతినిధి నారాయణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.


ఈవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

# శ్రీవారి ఆలయాన్ని అన్ని విధాలాఅభివృద్ధి చేస్తాం

## - వైసీపీ ప్రభుత్వం కోనేరు అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయలు వృథా - ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయ కోనేరు సుందరీకరణ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయలు వృథా చేసిందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ విమర్శించారు. మంగళవారం శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయ కోనేరును దేవాదాయ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, నిపుణులు అర్చకులతో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకునేందుకు ఆంధ్రతోపాటు కర్ణాటక, తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారన్నారు. అయితే కోనేరులో పుణ్య స్థానాలుచేసేందుకు భక్తులకు వీలు లేకుండా గత ప్రభుత్వం చేసిందని దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే నేడు ఇంజినీరింగ్‌శాఖ, నిపుణులతో పరిశీలించామన్నారు. శ్రీవారి ఆలయ సాంప్రదాయాలు కట్టుబాట్లకు అనుగుణంగా బృహతీర్థం పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారధి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, నిపుణులు, అర్చకులు పార్థసారధిచార్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, దేవాదాయ శాఖసిబ్బంది పాల్గొన్నారు.


కోనేరు పనులను పరిశీలిస్తునన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# ఎన్నికల క్లయిమ్స్‌పై సూపర్‌చెక్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని 6వరోడ్డు ఆర్‌కె నగర్, ఎంజి కాలనీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఎన్నికల క్లయిమ్స్ పై సూపర్ చెక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎన్నికల ఫామ్-6,7,8 క్లయిమ్స్‌కు సంబంధించి డిస్పోజ్ అయిన క్లయిమ్స్‌లను జిల్లా కలెక్టర్ స్వయంగా సూపర్ చెక్ చేశారు. ఆయా క్లయిమ్స్ కింద అర్జీ పెట్టుకున్న వాటి ఇంటి వద్దకు వెళ్లి బిఎల్ఓలు ఇంటి వద్దకు వచ్చారా మీకు ఓటు ఎక్కడ కావాలని అడిగారా తదితర వివరాలు ఆరా తీశారు. అర్జీ పెట్టుకున్న వారు ఇంటి వద్ద అందుబాటులో లేకపోతే వీడియోఫోన్ కాల్ ద్వారా వారితో మాట్లాడి జిల్లా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫామ్-6 క్లయిమ్‌కి సంబంధించి ఆర్‌కెనగర్‌లో ఫామ్-7కు సంబంధించి 6వరోడ్డులో, ఫామ్-8కు సంబంధించి ఎంజి కాలనీలో ర్యాండమ్‌గా జిల్లా కలెక్టర్ సూపర్ చెక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, బిఎల్ఓలు పాల్గొన్నారు.


జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# ఘనంగా శ్రీరమణమహర్షి 145వ జయంతి వేడుకలు

తాడిపత్రిటౌన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని పెన్నా నది తీరాన వెలసిన శ్రీరమణమహర్షి ఆశ్రమంలో స్వామి వారి 145వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం ఆత్మవిచారణ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆశ్రమ నిర్వాహకులు వివి బ్రహ్మం ఉపన్యాసం చేశారు. అనంతరం అంధులు, అనాదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెద్దఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి అనంతపురంకు చెందిన నృత్య కళానిలయము సంధ్యామూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. అదేవిధంగా శ్రీరమణ మహర్షి అనాధాశ్రయం విద్యార్థులు నిర్వహించి చెక్కభజన కార్యక్రమం హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వివి బ్రహ్మం, రమణమహేష్, తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహించిన దృశ్యం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు


చెక్క భజన చేస్తున్న విద్యార్థులు

# టిబిసి డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులుగా ప్రమీలమ్మ

## - ఉపాధ్యక్షులుగా పాటిల్ సత్యనారాయణరెడ్డి - ఏకగ్రీవంగా ఎన్నుకున్న డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులు

పుట్లూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త

టిబిసి డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షులుగా కోమటికుంట్ల గ్రామానికి చెందిన ప్రమీలమ్మ, ఉపాధ్యక్షులుగా పుట్లూరు గ్రామానికి చెందిన పాటిల్ సత్యనారాయణరెడ్డిని సాగునీటి సంఘం అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 14న సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు జరిగాయి. టిబిసి కింద పుట్లూరు. కడవకల్లు, ఎస్.గూడూరు, యల్లనూరు మండలంలోని తిరుమలాపురం, వేములపల్లి, తాడిపత్రి మండలంలోని పెద్దపొలమడ, చిన్న పొలమడ, దిగువపల్లి, నందలపాడు డిస్ట్రిబ్యూటర్లు టిబిసి పరిధిలోకి వస్తాయి. అనంతపురం హెచ్‌ఎల్‌సి కార్యాలయంలో టిబిసి డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నికను మంగళవారం అధికారులు నిర్వహించారు. యల్లనూరు మండలంలోని తిరుమలాపురం సాగునీటి సంఘం అధ్యక్షులుగా ప్రమీలమ్మను టిబిసి అధ్యక్షులుగా పుట్లూరు సాగునీటి సంఘం అధ్యక్షులు సత్యనారాయణరెడ్డిని ఉపాధ్యక్షులుగా ఆయా డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికైన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శాలువా కప్పి సత్కరించారు. టిబిసి డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవ ఎన్నిక పట్ల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె,సి ప్రభాకర్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు చవ్వాకుల శేఖర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడవకల్లు సాగునీటి సంఘం అధ్యక్షులు ఓబులాపురం, శ్రీనివాసులు నాయుడు, నాగిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అడిస్ట్రిబ్యూటర్ అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# ఘనంగా అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం

## - ముఖ్య అతిథిగాహాజరైన ఎమ్మెల్యే కందికుంట

కదిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు బిఎస్.నకార చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలులు అర్పించారు. అనంతరం పెన్షనర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు తీవ్ర అన్యాయం చేసిందని, పెన్షన్లు, వేతనాలు కనీసం 1వ తేది కూడా ఇవ్వకుండా వేదింపులకు గురి చేసిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, అందరికీ హెల్త్ ఇన్సురెన్స్ తీసుకోవానలి, రాష్ట్ర ముఖ్యమంత్రి భావిస్తున్నారన్నారు. పెన్షనర్లు, ఆర్థిక, సామాజిక భద్రతకు కృషి చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పెన్షనర్లు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# ఇళ్ల నిర్మాణాలలో అక్రమాలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదు

## సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దు - కొత్తగా లబ్ధిదారులు ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి - హౌసింగ్ అధికారులతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, డిసెంబర్ 17, (ప్రభాతవార్త బ్యూరో) గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల పేరుతో అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరిని వదిలేది లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. రాప్తాడు నియోజక వర్గంలో ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు, గతంలో జరిగిన అక్రమాలు, అలాగే లబ్ధిదారులు ఎంపిక వంటి వాటి మీద మంగళవారం సాయంత్రం హౌసింగ్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డిఈ, ఏఈలు పాల్గొన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ప్రస్తుతం ఇల్లు లేని వారు ఎంతమంది ఉన్నారు.. ఎంత మంది ఇల్లు కావాలని కోరుకుంటున్నారు... అలాగే స్థలాలు లేని వారు ఎంత మంది ఉన్నారు. వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాలిచ్చే అంశం గురించి కూడా చర్చించారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ప్రాద్బలంతో ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన వారి మీద ఇప్పటికే విచారణ జరుగుతోందని... తప్పు చేసిన వారిపై తగిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ కాలం నుంచి సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని వారికి బిల్లులు విషయంలో కూడా జాప్యం ఉండకూడదని ఎమ్మెల్యే ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల మీద త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులు ఎంపిక విషయం మీద పూర్తిగా దృష్టి సారించాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారులకు కచ్చితంగా బిల్లులు వచ్చేలా చూస్తామని దీనిపై ప్రభుత్వం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు.


హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

# టీచర్ శైలజకు మరొక షోకాజ్ నోటీసు జారీ

**( మొదటి పేజీ తరువాయి )** ఆ నివేదికను జిల్లా జడ్జి తెప్పించుకున్నారు. అయితే జడ్జి సోమవారం స్వయంగా కెవిఎస్‌ఆర్ పాఠశాలకు వెళ్లి వాయిస్ రికార్డింగ్ ఉన్న విద్యార్థినులతో పాటు ఇతర విద్యార్థినులను విచారించినట్లు హెచ్ఎం నారాయణ తెలిపారు

**ఆ టీచర్‌పై అసత్య ఆరోపణలు చేశామని డీఈవోకు లెటర్ రాసిన విద్యార్థినులు ః**

కెవిఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులను వ్రాసుకున్న విన్నపము ఏమనగా...మేము ఎన్ఎంఎంఎస్ తరగతులకు హాజరైయే వాళ్లము, ఒక రోజు తరగతి గదిలో ఫిజికల్ సైన్స్ టీచర్ చెప్పింది వినకుండా అల్లరి చేస్తుంటే సార్ మాకు ఇంట్రెస్ట్ ఉంటే క్లాస్‌కి రండి లేకపోతే రావదండి అని మందలించారు. ఈ విషయంలో మేము అందరం కలిసి సార్‌కి ఏదో విధంగా ఇబ్బంది కలిగించాలని అసత్య ఆరోపణలు చేయడం జరిగింది. పేపర్లలో వచ్చిన విషయము అసత్యము, కల్పితము. అలాంటివి ఏమి జరగలేదు. మాతో సార్ ఏప్పుడు అసభ్యంగా ప్రవర్తించలేదు. మా తప్పును తెలుసుకొని ఈ రోజు (16-12-2024) మీ దృష్టికి తీసుకొని వస్తున్నామము. మమ్మల్ని క్షమించాల్సిందిగా కోరుతున్నాము. భవిష్యత్తులో ఇలాంటి అసత్య ఆరోపణలు ఎవరి పట్ల చేయమని హామీ ఇస్తున్నాము. అని పది విద్యార్థినులు డీఈవోకు రాసిన లెటర్‌ను హెచ్‌ఎంకు అందజేశారు. ఆయన ఓ టీచర్ ద్వారా ఆ లెటర్‌ను డీఈవో ఆఫీసుకు పంపించారు.

**టీచర్ మదమంచి శైలజపై విద్యార్థినుల తల్లిదండ్రులు ఫిర్యాదు ః**

టీచర్ మదమంచి శైలజ 8వ తరగతి చదువుతున్న తమ పిల్లల మాటలను రికార్డింగ్ చేసి ఎవరెవరికో వాట్సాఫ్ ద్వారా పంపిందని, ఆమె చెప్పుడు మాటలు విని ఓ ఫిజికల్ సైన్స్ టీచర్ మీద అబద్ధాలు చెప్పారని, ఈ విషయం గురించి ఆ టీచర్ గాని మా పిల్లలు గాని మాకు చెప్పలేదని, ఇలా చేస్తే ఎలా అని, ముందుకు ఆ మహిళా టీచర్ మా పిల్లతో ఇంకా ఏం చేయిస్తుందోనని భయంగా ఉందని, దయచేసి మీరు చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఈనెల 10న హెచ్‌ఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ లెటర్ ఆయన ఓ టీచర్ ద్వారా డీఈవో ఆఫీసుకు పంపించారు.

**చర్యలు నుంచి తప్పించుకోవడానికి టీచర్ మదమంచి శైలజ తీవ్ర ప్రయత్నం ః**

.ప్రశాంతంగా ఉన్న, మంచి పేరు ఉన్న కెవిఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఘర్షణ వాతావరణం నెలకొనడానికి సోషియల్ స్కూల్ అసిస్టెంట్ మదమంచి శైలజ తీరే కారణం అని అక్కడే పనిచేస్తున్న పలువురు టీచర్లు, సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఆమె తనకు సంబంధంలేని విషయాల్లో జోక్యం చేసుకుంటూ, ఓ ఫిజికల్ సైన్స్ టీచర్‌పై వ్యక్తిగతంగా కక్ష పెట్టుకొని ఆయన్ను దెబ్బ తీయాలనే ఉద్దేశ్యంతో తన మాట వినే పది మంది విద్యార్థినులతో ఆ టీచర్‌పై పలు ఆరోపణలు చేయాలని చెప్పించి అలా చెప్పిన దానిని తన సెల్ ఫోన్‌లోనే రికార్డింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేసినట్లు విచారణతో తెలినట్లు తెలిసింది. దీనిపై అధికారులు విచారణ చేసిన తర్వాత ఆమెతో పాటు హెచ్‌ఎం, ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్‌కు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయం స్థానిక ప్రజా ప్రతినిధి దృష్టికి వెళ్లితే ఆమెతో పాటు తన భర్తను మందలించినట్లు తెలిసింది. అయితే ఈ చర్యలు నుంచి తప్పించుకోవడానికి ఆ మహిళా టీచర్ అనేక ప్రయత్నాలు చేసింది. ఏ టీచర్ మీద అయితే విద్యార్థినులతో పలు ఆరోపణలు చేయించిందో ఆ విద్యార్థినులే తాము ఆ టీచర్ మీద అసత్య ఆరోపణలు చేశామని, ఆ టీచర్ తమ పట్ల ఎప్పుడు అసభ్యంగా ప్రవర్తించలేదని ఈనెల 16న డీఈవోకు లెటర్ రాయించించినట్లు తెలిసింది. అదే విధంగా వాచ్‌మెన్, ఆయాలు (దళితులు)లను ఆ మహిళా టీచర్ గత ఆరు నెలలుగా వేధింపులకు గురిచేస్తూ, కులం పేరుతో దూషిస్తుందని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో అర్జీ ఇవ్వడం జరిగింది. ఇలా ఆ మహిళా టీచర్ తీరుపై వార్త దినపత్రికల్లో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి.

దీనిపై డీఈవో డీవైఈవోతో విచారణ చేయించారు. ఇందులో కూడా ఆ మహిళా టీచర్‌కు విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వాయిస్ రికార్డింగ్‌ల విషయంలో కూడా మంగళవారం మరొక షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇలా ఆ మహిళా టీచర్‌కు రెండు ఘటనల్లో రెండు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వాచ్‌మెన్, ఆయాలతో కూడా ఆ మహిళా టీచర్ రాజీ అయ్యి లెటర్ రాయించుకున్నట్లు తెలిసింది. ఇలా ఆమె చర్యలు నుంచి తప్పించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి పలువురు టీచర్లు, సిబ్బంది అసహ్యించుకుంటున్నారు. అయితే పేద విద్యార్థినులను తన స్వార్థం కోసం వినియోగించుకుంటున్న ఆ మహిళా టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. అయితే ఆ మహిళా టీచర్‌పై విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే.


Anantapur.
16-12-2024
To
The District Educational officer,
Anantapur.
Respected Sir,

ఓ ఫిజికల్ సైన్స్ టీచర్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదని డీఈవోకు విద్యార్థినులు రాసిన లెటర్


టీచర్ శైలజపైన విద్యార్థినుల తల్లిదండ్రులు హెచ్‌ఎంకు ఫిర్యాదు లెటర్

# కూలీల హాజరుశాతం పెంచండి - పిడి

యల్లనూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త

ఉపాధి కూలీల హాజరుశాతం పెంచాలని పిడి సలీంబాష పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగిన చోట నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. 7 రిజిస్టర్, జాబ్‌కార్డు అప్‌డేట్ వర్క్‌ఫైల్స్ మెయింటెన్ చేయాలని ఫారంఫండ్స్ గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. హార్టికల్చర్ సంబంధించి పెండింగ్ లేకుండా బిల్లు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపిడిఓ వాసుదేవరెడ్డి, ఏపిఓ షబ్బీర్‌బాష, ఇసి బబ్లూ టెక్నికల్ అసిస్టెంట్లు జయరాం, ప్రతాప్, శంకర్, ఆదిల్, శీన, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకటరామిరెడ్డి, చింతలరాయుడు, వీరభూషణ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.